

క్లుప్తంగా

చెత్తాచెదారం తొలగింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పాత కార్యాలయం వెనకాల ఉన్న గఫూరియా మసీద్ చుట్టూ ఉన్న ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని శుక్రవారం జేసీబీ సహాయంతో తొలగించారు. రంజాన్ పవిత్రమాసం ప్రారంభం కావటంతో నిత్యం పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనల కోసం మసీద్‌కు వస్తున్నారు. వారి కోరిక మేరకు ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. పనులను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పర్యవేక్షించారు.

కూలీల సంఖ్యను పెంచాలి

నవాబుపేట: ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కల్మన్‌కల్వ, మరికల్, బంగ్రపల్లి, కిష్టంపల్లి గ్రామాల్లో 'ఉపాధి' పనులను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామాల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రధానంగా అవసరమైన పనులు మొదటి ప్రియార్టీగా ఉపాధిలో చేపట్టాలన్నారు. అలాగే నర్సరీల్లో మొక్కలను టార్గెట్ ప్రకారం పెంచాలని, వాటి నిర్వహణను మండలాధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఏపీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ ఉన్నారు.

మహిళా వైద్యులు, సిబ్బందికి సన్మానం

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పని చేస్తున్న మహిళా వైద్యులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్ సింగ్, అన్నివిభాగాల హెచ్‌ఓడీలు, మహిళా వైద్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మిడ్జిల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు ఆటలు, పాటలు నిర్వహించారు. మహళలందరిని ఘనంగా సన్మానించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీఓ గీతాంజలి, మాజీ ఎంపీటీసీ గౌస్, హెచ్‌ఎంలు సరస్వతి, వెంకటయ్య, కవిత, నాయకులు రాజేశ్వర్, శంకర్, బంగారు, జహంగీర్, పర్వతాలు, తిరుపతి, జహీర్, రాజేందర్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ స్త్రీల పట్ల జరుగుతున్న వివక్ష తొలగాలంటే సమాజంలో మార్పు రావాలని, ఆ మార్పు మన ఇంటినుంచే మొదలవ్వాలని పిలుపునిచ్చారు. కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్, పెద్ద ఆదిరాల జెడ్పీహెచ్‌ఎస్, ఉదండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లోనూ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా అధ్యాపకులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

హక్కులను కాపాడేందుకు కృషిచేయాలి

మహమ్మదాబాద్: మహిళల హక్కులను కాపాడేందుకు మనమంతా కృషి చేయాలని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారికి ఆటలపోటీలు నిర్వహించారు. భీంరెడ్డి, పుట్టి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, గీత, మంజుల, వనజ, లత పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణింపు



నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగుతున్నారు. సాధికారత సాధించినప్పుడే మహిళలు శక్తివంతంగా ఎదుగుతారు. ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం పని చేస్తున్నాయి. వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను సైతం రూపొందించాయి. అధైర్యపడకుండా ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగినప్పుడే రాణించగలుగుతారు.

– జరీనాబేగం, డీడబ్ల్యూఓ, ఐసీడీఎస్, మహబూబ్‌నగర్

అవకాశాలు కల్పించాలి



మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. మహిళా సంఘాల ద్వారా మహిళలను చైతన్యం చేస్తున్నాం. ప్రభుత్వమిచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదిగిన నాడు ఆ కుటుంబమే కాకుండా సమాజం బాగుపడుతుంది. మహిళపై వివక్ష పోవాలి.

– రజిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, మహబూబ్‌నగర్

అతివలకు అండగా..!



- మహిళలకు రక్షణగా భరోసా, షీటీం, మహిళా పోలీస్‌స్టేషన్
- అండగా నిలుస్తున్న 'సఖి' కేంద్రం
- మహిళా చట్టాలపై అవగాహన అవసరం
- 'భరోసా'తో బతుకు బాటకు సిద్ధం

మహబూబ్‌నగర్ క్రైం: అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళ అణచివేతకు గురవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో మహిళలపై వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇలా ఏరంగంలో ఉన్నా వారిపై హింస తప్పటం లేదు. పెరిగిపోతున్న అఘాయిత్యాలను అధిగమించడానికి మహిళాలోకం నిశబ్ధాన్ని ఛేదించాల్సిన అవసరం ఉంది. అతివలకు అండగా భరోసా, షీటీం, మహిళా పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. భద్రత, రక్షణకు ఉన్న చట్టాలను అవగహనతో అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

■ జిల్లాలో ఉన్న 20 పోలీస్‌స్టేషన్లలో రోజువారీగా నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే దీంట్లో మహిళలు ఇస్తున్న ఫిర్యాదుల్లో అధికంగా భార్యాభర్తల గొడవలు, అదనపు కట్నం, గృహహింస కేసులు నమోదవుతున్నాయి. అపరిచిత వ్యక్తులతో పాటు తెలిసిన వ్యక్తులు సైతం వాట్సాప్, సెల్‌ఫోన్, ఆన్‌లైన్‌లలో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.

అర్ధరాత్రి ఫోన్లు చేసి వేధింపులు:

వేధింపులు, ఈవ్ టీజింగ్ చేస్తున్నవారిని పట్టుకునేందుకు షీ టీం బృందాలు పని చేస్తున్నా సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్ ఆధారిత నేరాలకు పాల్పడేవారు విద్యార్థినులు, యువతులను వేధిస్తూనే ఉన్నారు. మరికొందరు అర్ధరాత్రిదాటాక ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు విరామం లేకుండా ఫోన్లు చేస్తూ హింసిస్తున్నారు. ఇలాంటి చిత్రహింసలు ఎదుర్కొంటున్న వారిలో కొంత మంది వైద్యులూ, ఉపాధ్యాయులు, మహిళ ఉద్యోగినులు ఉన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా మారు వేషాల్లో ఉండే షీ బృందాలు పట్టుకుంటాయి. ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులపై బాధితులు ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసులు దృష్టికి సమస్యరాదు. బాధితుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని కొందరు పోకిరీలు మరింత రెచ్చిపోతున్నారు.

బాలికలకు 'భరోసా'

సమాజంలో వేధింపులకు గురయ్యే మహిళలతో పాటు బాలికలకు తోడు నిలువడమే భరోసా కేంద్రం ప్రధాన లక్ష్యం. ఇక్కడికొచ్చే బాధితులకు కుటుంబపరంగా లభించే అన్ని రకాల హక్కుల ప్రకారం రక్షణ కల్పించారు. మానసిక క్షోభ, వేదనకు గురైన మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచేలా కౌన్సిలింగ్ ఇస్తారు. గృహహింస బారిన పడ్డ మహిళలకు వారి ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా సహకారం అందిస్తారు. వేధింపులకు గురైన మహిళలకు అవసరమైన చట్ట, న్యాయ పరమైన సలహాలు, సూచనలిచ్చి ఆదుకుంటారు. ఎలాంటి ఆధారంలేని మహిళలను చేరదీసి వారికి అవసరమైన రక్షణ, తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తారు. అభిరుచిని బట్టి స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ ఇప్పిస్తారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మహిళలు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగహన పెంచుకోవాలి. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్ననాటి నుంచి మంచి విద్య అందించాలి. అన్ని రంగాల్లో పనిచేసే మహిళలు పెరగాలి. మహిళలు తాను ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులతో పాటు భర్త ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి. విద్యను అభ్యసించడంలో మహిళలు ముందుకు రావాలి. చిన్న విషయాలకు కోర్టు వరకు రాకుండా ఇంట్లోనే ధైర్యంగా ఎదుర్కొవాలి. – ఉమా మహేశ్వరి, న్యాయవాది

ఇంట్లో స్వేచ్ఛ ఇవ్వాలి



ప్రస్తుతం పని చేసే మహిళలకు ఇంట్లో స్వేచ్ఛ ఇవ్వాలి. గ్రామీణ స్థాయిలో అమ్మాయిలను విద్యారంగంలో మరింత ప్రోత్సాహించాలి. బాల్య వివాహాలు అరికట్టాల్సి ఉంది. 16నుంచి 17ఏళ్ల అమ్మాయిలు ప్రసవం కోసం జనరల్ ఆస్పత్రికి వస్తున్నారు. బాల్య వివాహం చేయకుండా చదువులో ప్రోత్సాహించాలి. అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో జ్ఞానం పెంచుకోవడానికి కష్టపడాలి. ప్రతి మహిళా నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ ముందుకు వెళ్లాలి.

–డా. శిరీష, ఆర్‌ఎంఓ, జనరల్ ఆస్పత్రి, మహబూబ్‌నగర్

ఏడాది	ఫోక్సో	అత్యాచారం	దాడి కేసులు
2023	116	103	446
2024	112	105	468
2025	16	5	2

'షీ'తో సేఫ్

మహిళల రక్షణే ప్రధాన లక్ష్యంగా ఆకతాయిల నుంచి రక్షించడానికి షీటీం పోలీసులు పని చేస్తున్నారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు ఎదుర్కొంటున్న యువతులు, మహిళలు తమ ఆవేదనను వాట్సాప్ ద్వారా చెప్పినా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సామాజిక మాధ్యమాలను, వాట్సాప్ నెంబర్‌ను తెరపైకి తీసుకొచ్చారు. కొందరు బాధితులు తల్లిదండ్రులకు చెప్పుకోలేని స్థితిలో ఉండటం, పోలీసులకు చెప్తే వివరాలు సైతం బహిర్గతం అవుతాయన్న భయం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 135 అవగహన కార్యక్రమాలు నిర్వహించగా 48 ఫిర్యాదులొచ్చాయి. 40 కౌన్సిలింగ్స్ నిర్వహించి 43 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆరు కేసులు నమోదు కాగా ఏడుగురిని అరెస్టు చేశారు.

■ ఈవ్‌టీజింగ్, వేధింపులు పెరుగుతున్నా ఫిర్యాదు చేస్తే పరువు పోతుందన్న భావనతో బాధితులు మౌనంగా భరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయడంతో కొంత మార్పు వచ్చింది. వాట్సప్, సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించారు.

'సఖి'తో రక్షణ



వివిధ రూపాల్లో దాడులకు గురైన మహిళల కోసం సఖి కేంద్రం ఉంటుంది. గృహహింస, లైంగిక వేధింపులు, పరువు హత్యలు, యాసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, తప్పిపోయిన మహిళలు, ఆరోగ్యం బాగాలేని ఒంటరి మహిళలకు వైద్య సహాయం, బలవంతంగా అబార్షన్లు ఇలా మహిళలపై జరిగే అన్ని రకాల వేధింపుల నుంచి రక్షించడానికి సఖి కేంద్రం పనిచేస్తోంది.

■ 18 ఏళ్ల లోపు బాలికలతో పాటు మహిళలకు ఏదైనా సమస్య వస్తే సఖి కేంద్రాన్ని ఆశ్రయించొచ్చు. 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యను వివరించవచ్చు. సఖి కేంద్రంలో ఇప్పటివరకు 2127కేసులు నమోదు కావడం జరిగింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- టీజీఓ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. టీజీఓ మహిళా విభాగం చైర్ పర్సన్ సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. పీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, షీ టీమ్స్ ఏఎస్‌ఐ వనజారెడ్డి, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల రామకష్ణగౌడ్, జిల్లా మహిళా కన్వీనర్ చంద్రకళ, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్, తానాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు..

పరీక్ష కేంద్రంలో సౌకర్యాలపై కలెక్టర్ ఆరా

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కోఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పరీక్షల నిర్వహణను ఆమె అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఎండలు పెరుగుతున్నందున తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహించరాదంటూ ఆమె సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ ప్రకటించారు. కళాశాల ప్రాంగణంలో ఇంటర్ బోర్డుద్వారా నిర్మాణమవుతున్న అదనపు గదులు ఎప్పుడు పూర్తవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణగౌడ్‌ను అడిగారు. కళాశాల పాతభవనానికి సున్నం వేయించటం, మైనర్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఆమెను కోరారు. కలెక్టర్ నిధుల విడుదలకు సానుకూలంగా స్పందించారు. పక్కనే ఉన్న బాలికల జూనియర్ కళాశాలతోపాటు ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. తహసీల్దార్ నర్సింగ్‌రావు ఉన్నారు.



కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల సందర్శించిన కలెక్టర్ విజయేందిరబోయి

లే అవుట్లపై అవగాహన కల్పించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వ్యక్తిగత ఇంటి స్థలాలు, లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించేలా అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, రిజిస్ట్రార్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహి హించారు. ఈ నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులు ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. శని, ఆదివారం కూడా నగరపాలక సంస్థ కార్యాలయం తెరచి ఉంటుందన్నారు.

వేగవంతం చేయండి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో విస్తత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈవీసీలో కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాదించుకోవాలి

కోయిల్‌కొండ: గ్రంథాలయాల్లో ఉన్నపుస్తకాలను చదివి జ్ఞానం సంపాదించుకోవాలని ఎస్పీ డి.జానకి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి ఆకర్షణ సతీష్ ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా 20కి పైగా గ్రంథాలయాలను ఏర్పాటుచేసిన ఆకర్షణ సతీష్‌ను ఎస్పీ అభినందించారు. ఆమెకు శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ వెంకటాజీ, హెచ్‌ఎం నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



ఆకర్షణను అభినందిస్తున్న ఎస్పీ జానకి

స్తంభాన్ని సరి చేశారు

సాక్షి ఎఫెక్ట్..



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి నుంచి ఖిల్లాఘనపురం వెళ్లే దారిలో గుంపోలు గట్టు సమీపంలో బీటీరోడ్డు పక్కన ఉన్న పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిన దానిపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'ఒరిగి పడితే ప్రమాదమే' అనే కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ డీఈ చంద్రమౌళి స్పందించి దాన్ని సరి చేయించాలని ఏడీ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఆయన సూచనతో ఏఈ రాములు వెంటనే జానంపేట ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వెంకటేష్ పంపించి స్తంభాన్ని సరి చేయించారు. చిన్న మట్టి దిమ్మెపై ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించి అక్కడ మట్టిని తీశారు. ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని గుంత తీసి అందులో నిటారుగా నిలిపి తీగలను సరిచేశారు. విద్యుత్ శాఖా ధికారులు సరిచేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు క్రీడాపోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని మహబూబ్‌నగర్ ఫస్ట్ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, స్లోవాకింగ్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ఎస్.విజయ్‌కుమార్, క్రీడాశాఖ అథ్లెటిక్ కోచ్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మిడ్జిల్: ప్రజలకు సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీశ్వర్ ఉన్నారు.

నేటి నుంచి కోటచింతల ఉత్సవాలు

నవాబుపేట: మండలంలోని మరికల్ కిష్టంపల్లి గ్రామ పరిధిలోని కోటచింతల బసవేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతున్నట్లు దేవాలయ ఉత్సవ నిర్వాహకులు రాజేష్, రాంమోహన్‌శర్మ, నరేందర్, దేవాలయ పూజారి మఠం సిద్దేశ్వర్ తెలిపారు. 8వతేదీ శనివారం గ్రామం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహం దేవాలయానికి తీసుకుని రావటం, 9న రుద్రాభిషేకం, తెల్లవారుజామున అగ్ని గుండ మహోత్సవం, 10న శకటోత్సవం, 11న మహా మంగళహారతి, శివపార్వతుల కల్యాణం ఉంటుందన్నారు. ఈఉత్సవాల్లో ప్రతి రోజు భజన, సేవా, హరికథ, పౌరాణిక నాటికలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు రాంమోహన్‌శర్మ, పాండు, శ్రీనివాస్‌లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. రంజాన్ తొలి శుక్రవారం మసీదులన్నీ కిటకిటలాడాయి. మహబూబ్‌నగర్‌తోపాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని మజీదుల్లో ముస్లింలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో జుమా నమాజు చేశారు. మసీదుల ఆవరణలో ఇత్తరు, మిస్వాక్, టోపీలు, ధార్మిక పుస్తకాల స్టాళ్లు వెలిశాయి. పట్టణంలోని జామీయ మసీదు, మదీనా, మక్కా, షాసాబ్‌గుట్ట, అన్సార్, గోల్, అలీ, మోతి, రహెమానియ, న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా, రైల్వేస్టేషన్ సమీపంలోని మసీదుల్లో ప్రత్యేక నమాజు చేశారు. ఇమామ్‌లు రంజాన్ విశిష్టతను వివరించారు. రంజాన్ నెలలో విధిగా జకాత్, ఫిత్ర చెల్లించాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌లో రూ.5లక్షల నిధులలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు. వెంకట్రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోట్ల రాములు, చౌదరి నారాయణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

చదువే ముఖ్యం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఖచ్చితంగా చదువే ముఖ్యమని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, భాస్కరయోగి, కృష్ణమూర్తి, సురేష్, రవీందర్, మంజుల, సుభాషిణి, స్వరూప, విద్యారాణి పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిల్లెగోపాల్, రాజ్‌కుమార్, యాదమ్మ, పద్మ, భాగ్య, రాజేశ్వరి, ఎర్ర నర్సింహులు, శేఖర్ పాల్గొన్నారు.

మరోసారి వాయిదా

- 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుపై వివాదం

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మరోసారి వాయిదా పడింది. 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు ఏర్పడ్డ వివాదం కారణంగా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. వాయిదా విషయాన్ని కొందరు కౌన్సిలర్లకు గురువారం రాత్రి సమాచారం అందగా కొందరు కౌన్సిలర్లకు శుక్రవారం ఉదయం వరకు తెలియకుండా ఉంది. ఈ ఏడాది నిధుల కేటాయింపు విషయానికి వస్తే కొన్నివార్డుల్లో అధికమొత్తంలో మరికొన్ని వార్డుల్లో తక్కువగా కేటాయించారు. ఇదే విషయమై గత వారం ఓ కౌన్సిలర్ కౌన్సిల్ అజెండా పేపర్లను చించి పడేసి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే మరోమారు అదే తప్పు చేస్తూ కొన్నివార్డుల్లో ఎమ్మెల్యే సూచించారని చెబుతూ ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు చేశారు. దీంతో కొందరు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం చేశారు. గురువారం ఇదే విషయమై చైర్‌పర్సన్, కమిషనర్లతో వాగ్వాదం నడిచింది. అన్ని వార్డులకు సమాన బడ్జెట్ కేటాయింపులు చేస్తామని చెప్పటంతో వివాదం సద్దుమణిగినట్లు భావించినప్పటికి సమావేశం వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు చైర్‌పర్సన్ వార్డులో రూ.10లక్షలు, వైస్‌చైర్‌పర్సన్ వార్డులో రూ.7లక్షలు, ఇతర 25మంది కౌన్సిలర్లకు రూ.5లక్షల చొప్పున సమానంగా కేటాయించాలని శుక్రవారం నిర్ణయించారు. సభ్యులు లేవనెత్తిన వివాదాలపై కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారిక సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ భర్తలు ఉండటం పట్ల కొందరు వార్డుకౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యా బోధన చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. మిడ్జిల్‌లోని దోనూర్ ప్రాథమిక పాఠశాలలో, చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డేమాన్,మద్దూర్, గూడూ ర్, లాల్‌కోట, పపల్లమరి ప్రాథమిక పాఠశాలలో, అమ్మాపు రం కురుమూర్తి ప్రాథమికోన్నత స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. మహబూబ్‌నగర్ మండలంలోని రామచంద్రాపూర్ ప్రాథమిక పాఠశాలలో, మూసాపేట మండలంలోని తుంకినీపూర్, నందిపేట పాఠశాలల్లో, జడ్చర్ల మండలం ఉదండాపూర్ హైస్కూల్‌లో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవానికి ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.



చిన్నచింతకుంటలో స్వయం పాలనలో విద్యార్థులు, టీచర్లు

మహిళలదే కీలక పాత్ర

రాజాపూర్: కుటుంబంలో, సమాజంలో అయినా మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎంఈఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రంగారెడ్డిగూడ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.